క్లుప్తంగా

కళాశాల సమస్యలు పరిష్కరించాలి

అలంపూర్: ప్రభుత్వ కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలని అధ్యాపకులు కోరారు. అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని, ఎమ్మెల్యే విజయుడును కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో గురువారం కలిసినట్లు తెలిపారు. కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన 33 కేవీ ఫీడర్‌లో అత్యవసరంగా మరమ్మతులు చేసి, చెట్ల కొమ్మలు తొలగించేందుకు చిన్న తాండ్రపాడు, మేడికొండ, తొత్తినోనిదొడ్డి గ్రామాలకు శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నరేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టు మండలంలోని ఇందువాసి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గంటపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తికి తీవ్రగాయాలు

మల్దకల్: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని గిలుకసుగుర్ గ్రామానికి చెందిన సురేష్ అత్తగారి ఊరు మద్దెలబండకు బుధవారం రాత్రి చేరుకున్నాడు. గురువారం ఉదయం సురేష్ తన బైక్‌పై గద్వాలకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కర్ణాటకకు చెందిన రాఘవేంద్రారెడ్డి కారులో అయిజ నుంచి గద్వాలకు వస్తున్నాడు. మార్గమధ్యలోని రైస్‌మిల్లు వద్ద కారు టైరు పగిలి అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్సనిమిత్తం ఆయనను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాలతో సమావేశం

అలంపూర్: అలంపూర్ పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో మండల మహిళా సంఘాలతో ఎంపీడీఓ పద్మావతి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో కొత్తగా ఏర్పాటు చేయాల్సిన సంఘాలపై చర్చించారు. కొత్త సంఘాల ఏర్పాటుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వృద్ధుల సంఘాలు, స్నేహ సంఘాలు, మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎం, సీసీసీ, వీఓఏ, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

ఆర్‌ఎస్‌పీ అరెస్టు కక్ష పూరిత చర్య

అలంపూర్: బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వ కక్ష పూరిత చర్యగా ఆర్‌ఎస్‌పీ ఆర్మీ నాయకులు మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా గ్రామస్తుల పోడు భూముల పట్టాల కోసం రైతులకు మద్దతుగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలిచిన ప్రవీణ్ కుమార్‌ను కుట్రతో అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపించారు. పోడు భూముల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కక్ష పూరిత చర్యలకు దిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైతుల పక్షపాతి సీఎం రేవంత్

రాజోళి: రైతుల శ్రేయస్సే ధ్యేయంగా నిరంతరంగా పని చేసే నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మల్లమ్మ కుంట నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ చేసిన కృషి ఫలించిందని, తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా ప్రధానమైన మల్లమ్మ కుంటను కదిలించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రైతుల్లో సంబరాలు మొదలయ్యాయన్నారు.

అవగాహన ఉండాలి

మానవపాడు: డిజిటల్ పేమెంట్స్ ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ ఫోన్ నంబర్, వ్యక్తిగత వివరాలు ఇతరులతో పంచుకోరాదని స్టేట్ బ్యాంక్ మేనేజర్ చైతన్యకుమారి సూచించారు. గురువారం మండలంలోని బోరవెల్లిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నేస్ వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బ్యాంకులో లభించే వివిధ ఖాతాలు ఉపయోగించుకోవాలన్నారు.

డీసీఎం బోల్తా

గద్వాల: అదుపుతప్పి డీసీఎం బోల్తా పడిన సంఘటన కేటీదొడ్డి మండలంలోని చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు మండలంలోని గంగస్‌పల్లి వైపు నుంచి కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు వడ్లధాన్యం తరలిస్తున్న డీసీఎం గురువారం వెంకటాపురం, ఇర్కిచేడు మధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. ధాన్యం వాహనం ఎక్కడి నుంచి ఎక్కడికి పోతున్నది ఎవరిది వాహనం అని మండల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండలానికి చెందిన ఓ రైసుమిల్లుకు కేటాయించిన వరిధాన్యం గంగస్‌పల్లి గోదాంలో స్టోరేజీ చేసినట్లు తెలిసింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న ఆర్. గార్లపాడు పెద్దవాగు



వర్షపు నీటితో ఉధృతంగా పారుతున్న షేకుపల్లి పెద్దవాగు



ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని షేకుపల్లి వాగును దాటుతున్న ప్రయాణికులు

వంతెనల్లేక వెతలు

- ప్రయాణికుల సమస్యలు తీరేనా?
- వాగుల ఉధృతికి తెగిన కల్వర్టులు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎర్రవల్లి: మండలంలో పలు వాగులపై వంతెనలు నిర్మాణం లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ఆరంభమైతే చాలు వాగులు ఉప్పొంగి ఉధృతంగా పారడం వల్ల ఎన్నో గ్రామాల ప్రజలు కనీసం పక్క గ్రామాలకు కూడా వెళ్లలేని దీన పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. అధిక వర్షాల వల్ల వాగులో నీటి ఉధృతి ఎక్కువైతే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటి రోజులు ఇంకా ఉన్నాయి. వాగులపై వంతెనలు లేని కారణంగా గ్రామాల్లో ఏదైనా అత్యవసరం ఏర్పడితే ఊరు కూడా దాటలేని పరిస్థితి దాపురిస్తోంది. తప్పని పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వాగును దాటేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాల బారిన పడటం ఖాయంగా ఉంటోంది. ఆయా గ్రామాల దగ్గర వాగులపై అవసరమైన చోట వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. పలు వాగులపై బ్రిడ్జిల నిర్మాణం చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగుతుండటంతో నిర్మాణం పూర్తి కాలేదు. మరికొన్ని వాగులపై పనులు ప్రారంభించినా బిల్లులు రావడంలేదనే నెపంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే వదిలేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి వాగులపై సకాలంలో వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి ఇటిక్యాలలో పరిస్థితి ఇలా..

- ఎర్రవల్లి మండలంలోని ఆర్.గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి గ్రామాల సమీపంలోని పలు వాగులు వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.
- ఆర్.గార్లపాడు సమీపంలోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమై దాదాపు ఏడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదు. చుట్టు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు వాగును దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడ్డారు.
- షేకుపల్లి గ్రామ సమీపంలో పెద్దవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటి వరకు సగం పనులు కూడా కాలేదు. బిల్లులు సక్రమంగా రాలేదని కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. తాత్కాలిక రోడ్డు వాగు ఉధృతికి గుంతలు ఏర్పడి పాడైంది.
- షేకుపల్లి చిన్నవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి దాదాపు పూర్తయింది. కానీ బ్రిడ్జిపై బీటీ రోడ్డు ఏర్పాటు చేయలేదు. కేవలం కంకరను మాత్రమే వేసి వదిలేశారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు.
- సాసనూలు గ్రామ సమీపంలో ఉన్న రెండు వాగులపై కల్వర్టులు పూర్తిగా పాడయ్యాయి. ప్రతి వర్షాకాలంలో రెండు వాగుల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు వాగులో వచ్చే నీటి ఉధృతి వల్ల ప్రమాదాలకు గురయ్యారు.
- ఇటిక్యాల మండల కేంద్రం నుంచి చాగాపురం, ఉదండాపురం గ్రామం నుంచి ఎస్సీ కాలనీ, ఉదండాపురం నుంచి సాతర్లకు వెళ్లే దారిలో ఉన్న నాలుగు వాగులకు వంతెనలు లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల సమీపంలో ఉధృతంగా ప్రవహించే వాగులపై వంతెనలను త్వరితగతిన నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లడానికి పలు వాగులపై వంతెనలు సక్రమంగా లేవు. ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లే దారిలో నాలుగు వాగులు ఉండటం వల్ల పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలం వస్తే చాలు నీటి ఉధృతి వల్ల వాగులు దాటలేక గ్రామంలోనే ఉండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వర గా పూర్తి చేయాలి.

– పెద్ద వీరన్న, సాసనూలు

పనులు ప్రారంభించి ఏడేళ్లవుతోంది..



మా ఊరి సమీపంలోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఏడేళ్లు పూర్తయింది. పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇంకా పూర్తి కాలేదు. భారీ వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పూర్తిగా వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. వాగు పొంగి పొర్లడంతో వారం రోజులుగా వాగు దాటడానికి రావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– కుర్వ ఆశన్న, కారుపాకుల

ఉన్నతాధికారులకు విన్నవించాం..

గార్లపాడు దగ్గర బ్రిడ్జి నిర్మాణం ప నులు ప్రారంభించి ఫిల్లర్ గుంతల్లో పూర్తిగా గుండ్లు ఉండటంతో బ్లా స్టింగ్ చేయడానికి ఎక్కువ సమ యం తీసుకుంటోంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కా వడంతో ఫిల్లర్ గుంతలు పూర్తిగా నీటితో నిండిపోయాయి. జూరాల కాల్వ నుంచి నిరంతరం నీ రు రావడంతో పనులు సాగడం లేదు. వాగులపై వంతెనలు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివే దించాం. వారి నుంచి అనుమతి రాగానే టెండర్లు వేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, అలంపూర్



మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్య పారుతున్న వాగు



మారమునగాల-2 లో ప్రవహిస్తున్న వాగులో దాటుతున్న ప్రజలు

అన్నదాత ఆగమాగం

- ఎడ తెరపిలేని వర్షాలతో సాగని పనులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ధరూరు: వారం రోజులుగా ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతుల పంట పొలాల్లో పనులు సాగనీయడం లేదు. వేరుశనగ తెంచకపోవడంతో వానలకు తడిసి మొలకలు వస్తున్నాయి. మొలకెత్తిన వేరుశనగ పంటను చూయించి లబోదిబో మంటున్నారు.

నీటి మునిగిన పంటపొలాలు పరిశీలన

మానవపాడు: వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలను మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ పరిశీలించారు. పత్తి 126 ఎకరాల్లో, 24ఎకరాల్లో కంది, 19 ఎకరాల్లో మిరప పంట నష్టపోయాయని తెలిపారు. నష్టపోయిన పంట వివరాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

ఎడతెరిపిలేని వర్షాలతో ఇక్కట్లు

అయిజ: మండలలో మూడురోజులనుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో రోడ్లు, కల్వర్టులు ప్రయాణానికి ప్రతికూలంగా మారాయి. మేడికొండ రోడ్డు పై నిర్మించిన డైవర్షన్ రోడ్డు బురదగామారి లారీ ఇరుక్కపోవడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. కర్నూలు-రాయచూరు రోడ్డుపై పట్టణ సమీపంలో వంతెనకింది చెత్తాచెదారం ఇరుక్కొని నీటిప్రవాహానికి అడ్డుగా మారింది. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు సంఘటనా స్థలానికి చేరుకొని మున్సిపల్ యంత్రాల ద్వారా సిబ్బందితో చెత్తను తొలగించారు.



అయిజ పట్టణ సమీపంలోని కాజ్‌వేవద్ద చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వర్ష బీభత్సం.. పొంగిన వాగులు, వంకలు

ఉండవెల్లి/ఇటిక్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. వాగులు, వంకలు అధికంగా ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. చాగాపురం, సాతర్ల గ్రామాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కూలిన ఇళ్లను ఆర్ఐ మధు అధికారులతో కలసి పరిశీలించారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

గట్టు: మండలంలో 3 ఇళ్లు పూర్తిగాను, మరో 4 ఇళ్లు పాక్షికంగాను దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. గట్టులో 2 ఇళ్లు పూర్తిగా, మరో 4 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా, మాచర్ల-1 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గట్టులో వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను గిర్దావర్ రాజు, పంచాయతీ కార్యదర్శి కుర్మయ్య పరిశీలించారు.



గట్టులో వర్షాలకు కూలిన మట్టిమిద్దె



బొంకూరులో వర్షానికి కూలిన ఇల్లు

రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సంగీత లక్ష్మి

ధరూరు: అన్నదాతలకు ఇబ్బందులు కలిగిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ సంగీత లక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండల ఏఓ శ్రీలతతో కలిసి గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులు పరిశీలించారు. ఇటీవల కాలంలో రైతులకు యూరియా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు వార్తల్లో వస్తోందని, గ్రామంలోని అన్ని దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉందని, ఎవరిని ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. స్టాక్ వివరాలను బ్లాక్ బోర్డుపై ఉంచాలని, నిర్ణయించిన ధరల ప్రకారమే మందులు అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ డీలర్లు, రైతులు ఉన్నారు.

పాఠశాలలో ఫేయల్ రికగ్నైజేషన్ సిస్టం



అలంపూర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ అశోక్ కుమార్

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలలో ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం అధారంగా అటెండెన్స్ అమల్లోకి వచ్చిందని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. ఆగస్టు మొదటి వారం నుంచి ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ముఖ ఆధారిత హాజరు) ద్వారా ఉపాధ్యాయుల హాజరు ప్రారంభమైనట్లు తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పకడ్బందీగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సువిజ్ఞానం, ఉపాధ్యాయులు నాగరాజు, ఎల్లకృష్ణ ఉన్నారు.

అంబులెన్స్ తనిఖీ చేసిన అధికారులు

అయిజ: మండల కేంద్రంలో గురువారం 108 వాహనాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సిద్దప్ప తనిఖీ చే శారు. మెడికల్ పరికరాలు ఎలా పనిచేస్తున్నాయని 108 సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మల్టీ చాలన్ మానిటర్, బీపీ ఆపరేటర్, లారిజస్కోప్, థర్మామీటర్, లారింజస్కోప్, సికాలర్, ఏఈడీ మిషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, 108 డిస్టిక్ కోఆర్డినేటర్ రత్నమయ్య, డిస్టిక్ డాటా మేనేజర్ రామాంజనేయులు, సిబ్బంది, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నరసింహులు, పైలట్ ఈదన్న పాల్గొన్నారు.



108లో పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ సిద్దప్ప

ఘనంగా ఆరాధనోత్సవాలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలం కొంకల గ్రామంలో వెలసిన రామయ్య ఆచారి 14వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కొంకల, బురెడ్డిపల్లి, మెల్లచెరువు భజన బృందం ఆధ్వర్యంలో సంకీర్తన కార్యక్రమం చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో గడప నిర్మాణం

అయిజ: మండలంలోని సంకాపురంలో నిర్మిస్తున్న రామాలయంలో భక్తులు గడప నిర్మాణం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రాలు జపిస్తూ గడప నిర్మాణం చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మల్దకల్: మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని వన్‌ఫర్‌వన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సులోమితమ్మ అన్నారు. గురువారం మండలంలోని పాల్వాయి గ్రామంలో వన్‌ఫర్‌వన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, మనందరి బాధ్యత అన్నారు.

జాతీయ జెండాల వితరణ



శాంతినగర్: స్థానిక రామచంద్రానగర్ కాలనీలో బీజేపీ నాయకులు త్రివర్ణ పతాకం జెండాలను కాలనీ వాసులకు గురువారం వితరణ చేశారు. వడ్డేపల్లి బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

అయిజ: మండలంలోని వివిధ శివారులలో బీజేపీ నాయకులు రైతులకు జాతీయ జెండాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు.

రాజోళి: బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో త్రివర్ణ పతాకాలను ఇంటింటికి పంపిణీ చేశారు.

సమస్యలపై తహసీల్దార్‌కు వినతి

ధరూరు/మల్దకల్: రెండు మండలాల్లో నెలకొన్న సమస్యలపై తహసీల్దార్లు నరేందర్, ఝాన్సీరాణికి బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, డీకే స్నిగ్ధారెడ్డి, మండల నాయకులు తిరుపతిరెడ్డి, రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, నల్లారెడ్డి, రెడ్డప్ప, రాముడు, వెంకటేష్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు



అలంపూర్: స్వాతంత్ర్య వేడుకలకు అలంపూర్ ముస్తాబైంది. ఉత్సవాలు ఘనంగా ని ర్వహించడానికి ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ రంగ కార్యాలయాలను మువ్వన్నెల జెండా ఎగరేసేందుకు ముస్తాబు చేశారు. ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని నింపుతూ వేడుకలు జరగనున్నాయి.

ధరూరు: పంద్రాగస్టు జెండా కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జెండా పండుగకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది.

ఇందువాసిలో దంత వైద్యశిబిరం



గట్టు: మండలంలోని ఇందువాసి గ్రామంలో గురువారం భవిష్యభారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి బీ.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడారు. దంతాలను ప్రతిరోజు రెండు పర్యాయాలు బ్రష్‌తో శుభ్రం చేసుకోవాలని, పంటి నొప్పికి తప్పని సరిగా వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం సపోర్టు అధికారి మునిస్వామి, జీవనోపాదుల అధికారి వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్టు జిలాని, స్టాఫ్ నర్సు రాగిణి, వాల్మీకి నాగరాజు, లక్ష్మన్న, హలీం పాష, వీరన్నగౌడు, నర్సింహులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలి

గట్టు: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల జీతాలు రెగ్యులర్‌గా చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష డిమాండ్ చేశారు. ఇందువాసి గ్రామంలో పంచాయతీ కార్మికులను కలిసి హలీంపాష మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంచాయతీల్లో పనులు చేసే కార్మికులకు బూట్లు, గ్లౌజులు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వ ర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు బజారమ్మ, తాయ మ్మ, దావీదు, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లతో నిరసన

అలంపూర్: రోడ్లపై నిలిచిన వర్షపు నీటిలో బీజేపీ నాయకులు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. అలంపూర్ పట్టణంలోని అక్బర్‌పేట, 6,7 వార్డుల్లోని ఆయా కాలనీల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో శరత్ బాబు, రాజగోపాల్, నాగమల్లయ్య, నరేష్, మద్దిలేటి, వినీత్, బంగారు లక్ష్మణ్, హేమంత్, మాలిక్ తదితరులు ఉన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సమస్యలు తీరినట్లే

గట్టు: లైసెన్స్‌డ్ సర్వేయర్ల రాకతో రైతుల భూ సర్వేకు సంబంధించిన సమస్యలకు చాలా వరకు పరిష్కా రం లభిస్తుందని ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఇన్‌చార్జి సర్వేయర్ హరికృష్ణతో కలిసి గట్టుకు 10 మంది లైసెన్స్ సర్వేయర్లు వచ్చారు. క్షేత్ర స్థాయిలో భూమి కొలతలు, హద్దుల గుర్తింపు, మ్యాపింగ్, భూమితి యాప్ ద్వారా టి పన్ల తయారీ, గ్రామ నక్షల గుర్తింపు వంటి వాటిపై ఇన్‌చార్జి సర్వేయర్ హరికృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్‌లు వివరించారు. ఎంపిక చేసిన సర్వేయర్లకు ఇది వరకే 50 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు హరికృష్ణ తెలిపారు. మండలానికి కేటాయించిన సర్వేయర్లకు 40 రోజుల పాటు మండల సర్వేయర్ కింద అప్రెంటిషిప్ విధానంతో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి సర్వేయర్ తెలిపారు. భూ సర్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై లైసెన్స్ సర్వేయర్లు దృష్టిని సారిస్తే, రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్‌ను కలిసి లైసెన్స్ సర్వేయర్లు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



మల్దకల్: మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణుడు, గోపిక వేషధారణలతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అక్షయ రెడ్డి, ఉపాధ్యాయ బృందం శుస్టిన్, ప్రమీల, విజయలక్ష్మి, రాజేశ్వరి, మహేశ్వరి, సుప్రియ, లిఖిత, లావణ్య, శంకర్ నా యుడు, ప్రభాకర్, వెంకట్రాములు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో గ్రామాల్లో ఫీవర్ సర్వే, డ్రై డే సర్వే జిల్లా వైద్యాధి కారి ఎస్.కె సిద్దప్ప ఆదేశానుసారం నిర్వహిస్తున్నామని డాక్టర్ హేమమానస తెలిపారు. గురువారం ఆయా గ్రామాలలో వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. దీర్ఘకాలిక రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరత తీర్చాలని వినతి



రాజోళి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను అందించాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు కే వీపీఎస్ నాయకులతో కలిసి గురువారం తహసీల్దార్ పి.రామ్మోహన్‌కు వినతిపత్రం అందచేశారు. నదిలో నీరు ఎక్కువగా ఉన్న కారణంగా ఇసుక తీయడానికి ఇబ్బందిగా ఉందని, ప్రస్తుతం తుమ్మిళ్ల నుంచి మాత్రమే అనుమతి ఉండగా, అది కూడా ఎక్కువ ధరకు లభ్యమవుతోందని తెలిపారు. లబ్ధిదారులను దృష్టిలో పెట్టుకుని తుమ్మిళ్ల నుంచి లభించే ఇసుకను తక్కువ ధరకు ఇందిరమ్మ ఇళ్లకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుందర్ రాజు, నర్సింహులు, లక్ష్మన్న, జయన్న పాల్గొన్నారు.

ఆహార భద్రత కార్డుల పంపిణీ



రాజోళి: పేదలకు కడుపునిండా అన్నం పెట్టేందుకు రేవంత్ సర్కార్ ఆహారభద్రత కార్డులు అందిస్తోందని కాంగ్రెస్ నాయకుడు పెద్దింటి నాగేష్ అన్నారు. గురువారం మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో లబ్ధిదారులకు ఆహారభద్రత కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికి కార్డును అందించి మాట నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ జ్ఞానేశ్వరి, దస్తగిరి, తిమ్మప్ప, మహేష్, విష్ణు, వెంకటప్ప, ఖాజా పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి



గద్వాలటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.20 వేలు అమలు చేస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం వీఓఏల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో తిమ్మప్ప, బీసమ్మ, జావీద్, వెంకట్రామయ్య, వనిత, రేణుక, కళావతమ్మ, నవీన, కవితారాణి, సోమేశ్వరి, నర్సింహ, వెంకటేష్, సీఐటీయూ నాయకులు ఉప్పేర్ నర్సింహ, డ్యాం అంజి, శ్రీనివాస్ ఉన్నారు.

పదవీకాలం పెంపుపై హర్షం

అయిజ: రాష్ట్ర వ్యాప్తంగా పీఏసీఎస్ చైర్మన్లు, పాలకవర్గం పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వుల జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవిలకు ధన్యవాదాలు తెపారు.